# మనసు చివుక్కుమన్నా.. చదువాపలేదు!

**చదువుకోవాలన్న మనసుంటే, ఏదయినా సాధించాలన్న సంకల్పమే ఉంటే, చదువు, పిల్లలు, బాధ్యతలు అడ్డు కానే కావు. వివాహమైన పదేళ్ల తరవాత చదువు ఆరంభించి..**

**పీజీ పూర్తిచేసిన రాజమండ్రికి చెందిన వెంకటలక్ష్మి ఎంటెక్ చదువుతోన్న కొడుకుతో కలిసి గ్రూప్స్ రాశారు. గెజిటెడ్ ఉద్యోగం సాధించారు. వసుంధర అభినందనలు తెలిపినప్పుడు ఆమె చెప్పిన ముచ్చట్లివి.**



**మా** అమ్మానాన్నలు నిరక్షరాస్యులు. ఉన్న కొద్దిపాటి భూమిని నమ్ముకొన్న పెద్ద కుటుంబం మాది. ఐదుగురు సంతానంలో నేను మూడోదాన్ని. ఆరో తరగతితో నా చదువుకి చుక్క పడింది. ఇద్దరన్నలు, తమ్ముడినే చదివించే పరిస్థితి. నేను నాన్నకు సాయంగా పొలం పనులకూ,ఇల్లు గడవనప్పుడు కూలి పనులకూ వెళ్లేదాన్ని. పదిహేనేళ్లు నిండకుండానే పెళ్లి చేసేశారు. ఆయన చిరు వ్యాపారి. స్థితిపరుడేం కాదు. ఉన్నంతలో ఇల్లు నెట్టుకొచ్చే పరిస్థితి. ఇద్దరు మగపిల్లలు పుట్టడంతో ఇంటి పనులతో నేను బిజీగా మారిపోయాను. పిల్లలకు ట్యూషన్లూ అవీ లేవు. స్కూలుకి వెళ్లొచ్చాక 'మమ్మీ అవి చెప్పూ, ఇవి చెప్పూ' అంటూ నా వద్దకొచ్చే వాళ్లు. నాకేం వచ్చు! తెలుగు కూడా చదవడం రాదాయె. అప్పుడనిపించింది, మళ్లీ చదువుకోవాలని! పిల్లలకు చెప్పడం కోసమైనా బాగా చదువుకోవాలని! ఆయనతో అంటే 'నీకు ఆసక్తి ఉంటే సరే' అన్నారు.

## ఈ వయసులో చదువేంటి అన్నారు..

మెట్రిక్యులేషన్‌కి దరఖాస్తు చేశా. దాచుకొన్న డబ్బులతో ట్యూషన్ పెట్టించుకున్నా. అక్కడ చిన్నారుల మధ్య కూర్చొని చదువుకొనేదాన్ని. చుట్టుపక్కల వాళ్లంతా 'ఈ వయసులో చదువేంటి! ఇప్పుడవసరమా' అని ఎగతాళి చేసేవాళ్లు. మనసు చివుక్కుమనేది. సర్ది చెప్పుకొనేదాన్ని. ఒకవైపు నా పిల్లలకు పాఠాలు చెప్పుకొంటూనే, కొత్త విషయాలు తెలుసుకొనేదాన్ని. మెట్రిక్యులేషన్ పాసయ్యా. చదువుకోవాలన్న ఉత్సాహం రెట్టింపైంది. దూరవిద్యలో బీఏ, ఎమ్మే పూర్తి చేశాను.

## అబ్బాయి అలా అనేసరికి..

చదువుతో నాలో మార్పొచ్చింది. అంతకుముందు బయటి వ్యక్తులతో మాట్లాడటం, పిల్లల్ని సముదాయించడం తెలిసేది కాదు. వాళ్లేదైనా తప్పు చేస్తే ఎడాపెడా బాదేదాన్ని. పీజీ చదివాక పిల్లల్ని అర్థం చేసుకునే తత్వం పెరిగింది. ఇంట్లో ఎలాంటి వాతావరణం ఉండకూడదో, వాళ్ల ఒత్తిడికి గురవకుండా ఎలా చూడాలో తెలిసొచ్చింది. ఓసారి మా పెద్దాడు 'నువ్వు కొట్టినప్పుడు తమ్ముణ్ని తీసుకుని ఇంట్లోంచి పారిపోవాలని అనిపించేది మమ్మీ. ఇప్పుడలా అనిపించడం లేదు. ఎప్పుడూ ఇలాగే ఉండు' అన్నాడు. నేనెలా ప్రవర్తించేదాన్నో అర్థమై సిగ్గుగా అనిపించింది.

## నాకే ఉద్యోగం ఉంటే..

చదువుల బాటలో చకచకా సాగుతున్నప్పుడే ఉద్యోగం చేయాలన్న ఉత్సాహం కలిగింది. టైపింగ్ నేర్చుకున్నా. హయ్యర్ పాసయ్యా. బీఈడీ ప్రవేశ పరీక్షలో 33వ ర్యాంకుతో సీటు సంపాదించినా, అప్పటికే పిల్లలు పెద్ద చదువులకు రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువవడంతో కాలేజీలో చేరలేదు. అంతెందుకు, విద్యారుణం వస్తుందనే మా అబ్బాయినిమన రాష్ట్రంలో కాకుండా గుజరాత్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో చేర్పించాం. అప్పుడూ, బ్యాంకు రుణం కోసం ప్రభుత్వోద్యోగి హామీ సంతకం అవసరమైంది. మా బంధువుల్లో ఒక్కరు కూడా ముందుకు రాలేదు. దాంతో రుణం రాలేదు. నేనూ సంపాదిస్తుంటే, ప్రభుత్వోద్యోగమే ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చి ఉండేది కాదు కదా అని బాధపడ్డాను. అప్పు చేసి అబ్బాయిని పంపాం. వాడు అటు వెళ్లిన క్షణంలోనే గ్రూప్స్ రాయాలని నిర్ణయించుకొని 2004లో మొదటి ప్రయత్నం చేశా. కలిసి రాలేదు. కానీ ఆశ, చదవాలన్న ధ్యాస పెరిగాయి. నాలుగేళ్ల తరవాత మళ్లీ రాశా. తృటిలో అవకాశం చేజారింది. ఎలాగయినా సాధించాలన్న తపన ఎక్కువైంది.

## రెండు ప్రభుత్వోద్యోగాలు..

శిక్షణ తీసుకొంటూ, ఉద్యోగ ప్రయత్నాలు చేయాలనుకున్నా. ఆయన, పిల్లలు వెళ్లగానే కోచింగ్ కోసం బయటకు వెళ్లిపోయేదాన్ని. అట్నుంచి గ్రంథాలయానికే. సాయంత్రం ఎప్పుడో అలసిపోయి ఇల్లు చేరుకునే దాన్ని. సినిమాలూ, షికార్లూ, బంధువులింట్లో శుభకార్యాలకు బై చెప్పేశాను. చదువే లోకంగా మారిపోయాను. 2009లో ఏసీబీలో ఉద్యోగంవచ్చింది. సాధించాననుకొన్నా. కానీ విశ్రమించలేదు. కష్టపడి గ్రూప్2 పరీక్షలకు సన్నద్ధమయ్యా. అందులోనూ సత్ఫలితం వచ్చింది. ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం వచ్చింది.

## మా అబ్బాయిల లక్ష్యం అదే!

మా పెద్దబ్బాయి ఎంటెక్, చిన్నాడు బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నారు. గతేడాది పెద్దవాడితో కలిసి గ్రూప్-1 ప్రిలిమినరీ రాశా. నేను మాత్రమే మెయిన్స్‌కి ఎంపికయ్యా. కానీ చిన్నాడి చదువుకు డబ్బు కట్టాల్సి వచ్చి, శిక్షణ తీసుకొని ముందంజ వేయలేకపోయా. ఇప్పుడు నాకీ ఉద్యోగం వచ్చాక 'నువ్వు గ్రూప్1 మళ్లీ రాద్దాం అమ్మా' అని పెద్దవాడంటుంటే, 'నేను విదేశాలకు వెళ్లనమ్మా, సివిల్స్ సాధించి చూపిస్తాను' అని చిన్నవాడన్నాడు. పిల్లలకు స్ఫూర్తినందించడం కంటే నాక్కావల్సిందేముంది! అయితే నాకూ ఓ లక్ష్యం ఉంది, నాకిప్పుడు 38 ఏళ్లు. గ్రూప్ వన్ రాయడానికి ఇప్పటికీ అవకాశం మిగిలి ఉంది. సాధించడానికే ప్రయత్నిస్తా.

*– జి.భరత్‌కుమార్, ఈనాడు పాత్రికేయ పాఠశాల*




## వన్నెల ప్రమిదలు

ఇంటిల్లిపాదికీ ఆనందాన్ని తెచ్చే ఈ దీపావళి పండుగకు వన్నె తీసుకువచ్చేవి మాత్రం కచ్చితంగా ప్రమిదలే. కాస్త విభిన్నంగా ఆలోచించి వాటికి చిన్న చిన్న మెరుగులద్దితే ప్రత్యేకంగా కనిపిస్తాయి.

- జియోమెట్రికల్ ఆకృతుల్లో అర్ధచంద్ర, చతురస్ర, అండాకారంలో ఉన్న గాజు అద్దాలను తీసుకోవాలి. వాటిపై రకరకాల ఆకృత్తుల్లో ఉండే స్ఫటికాలు, పూసలు తీసుకుని ఓ పద్ధతి ప్రకారం పేర్చుకుంటూ రావాలి. మధ్యలో గాజు పాత్రలో ఉంచిన కొవ్వొత్తి లేదా ప్రమిదను కూడా ఉంచితే చూడటానికి బాగుంటుంది. ఫ్లోటింగ్ కొవ్వొత్తుల్ని కూడా ఉంచవచ్చు. పాత సీడీలపై కూడా ఈ విధంగా ప్రయత్నిస్తే దీపకాంతులు అద్దంపై ప్రతిబింబించి ఇల్లు శోభాయమానమవుతుంది.



